క్లుప్తంగా

సమాజసేవలో భాగస్వాములు కావాలి



మంగళగిరి: విద్యార్థులు విద్యనభ్యసించడంతో పాటు సమాజసేవలో భాగస్వాములు కావాలని నిర్మల పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్ అన్నారు. నిర్మల పాఠశాల విద్యార్థులు సేకరించి బియ్యం, నిత్యావసర సరకులు, బిస్కెట్లు, పండ్లు, బ్రెడ్‌లను మంగళవారం మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమానికి అందజేశారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవ అన్న మదర్‌థెరిస్సా ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అనాథలను ఆదుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సిస్టర్ జ్ఞానసుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీలపై అవగాహన

మంగళగిరి: నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మలేరియా, డెంగీ జ్వరాలను గుర్తించి చికిత్స అందించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ తమ పరిధిలో ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ ఎం సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంటు శ్రీనివాస్, నరసింహారావు, మూర్తి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామ సచివాలయ కార్యదర్శికి మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం సెప్టెంబర్ 29వ విజయవాడలోని జరిగే ధర్నాకు దళితులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

నేడు టెంపుల్ హిల్ ఏకో పార్కు ప్రారంభం

మంగళగిరి: నగరంలో ఎయిమ్స్ ఆసుపత్రి పక్కన ఏర్పాటుచేసిన టెంపుల్ హిల్ ఏకో పార్కును బుధవారం రాష్ట్ర విద్యుత్, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, మైన్స్ అండ్ జియాలజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

రేపు జాషువా జయంతి

తెనాలి: గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నవయుగ కవి చక్రవర్తి జాషువా 128 జయంతిని నిర్వహించనున్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణమండపంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సభలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర మండల విద్యాశాఖాధికారుల సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాజగోపాల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సాయంత్రం 4–6 గంటల మధ్య కళాకారులతో జాషువా పద్యగానం ఉంటుందని చెప్పారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారని సమితి అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్ తెలిపారు.

ప్రకటన (దస్తావేజులు పోయినవి)

మాకో 1వవారి తల్లియైన లేటు దంతాల సామ్రాజ్యం (మరణించిన) గారి పేరిటన మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ వారి కార్యాలయం డ.నెం. 2181/2018 ద్వారా రిజిష్టరు కాబడిన కురగల్లు గ్రామ సర్వే నెం. 549 లో ఏ.పి.సి.ఆర్.డి.ఏ ఫేజు టౌన్ షిప్-21, సెక్టార్ నెం-182, కాలనీ నెం-694, బ్లాక్ నెం-95, ప్లాట్ నెం-31కు, ఉప వర్గము 12 ... ఒరిజినల్ దస్తావేజులు ... పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబర్లకు తెలియపరచగలరు.

వెల్పుల లలిత కుమారి, దంతాల కోటేశ్వరి, దంతాల దివ్య కీర్తి, బట్టా జోసఫ్, బేతపూడి జ్యోతి
9542221259, 9985744784

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

మంగళగిరి: నగర పరిధిలోని తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఏరియాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు, సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఇందిరానగర్, లక్ష్మీనృసింహకాలనీ, మార్కేండేయ కాలనీ, కాజ, ఆత్మకూరు, యర్రబాలెం, నిడమర్రు, రామచంద్రపాలెంలలో మంగళవారం వలంటీర్లతో కలిసి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు సర్వే గురించి వివరాలను వివరించి పరీక్షలు నిర్వహించడంతోపాటు ప్రథమ చికిత్స నిర్వహించి మరింత మెరుగైన వైద్యం అవసరమనుకున్న రోగులను ఆసుపత్రులకు రిఫర్ చేశారు.

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సచివాలయాలు 1,2,3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను ఆరోగ్యసిబ్బంది మంగళవారం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎస్తేరురాణి తెలిపారు. సచివాలయం-1 పరిధిలో 1457 గృహాలు ఉండగా ఇప్పటివరకు 820 గృహాల్లో సర్వే నిర్వహించామని చెప్పారు. సచివాలయం-2 పరిధిలో 1095 గృహాలు ఉండగా 695 వరకు సర్వే చేశారని, సచివాలయం-3 పరిధిలో 1445 గృహాలు ఉండగా 1400వరకు సర్వేలు నిర్వహించామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి వారి అనారోగ్య సమస్యలు తెలుసుకుని పరీక్షలు చేసి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు అందజేస్తున్నట్లు చెప్పారు.



నిడమర్రులో వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది



వైద్యపరీక్షలు చేస్తున్న ఆరోగ్యసిబ్బంది

కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు గోవర్ధన, ఏఎన్ఎంలు భారతీజ్యోతి, లావన్య, మాబు, సరోజ, ఆనంద కుమారి, అరుణ, ఆంతోనిరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకటి నుంచి ప్రత్యేక వైద్య సేవలు

తాడేపల్లిరూరల్: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు డాక్టర్ మానస పేర్కొన్నారు. డోలాస్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అక్టోబర్ ఒకటి నుంచి 24వ తేదీ వరకు ఎంటిఎంసి పరిధిలో పలు ప్రాంతాల్లో వైద్యసేవలు అందించనున్నామని, ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మంగళవారం డాక్టర్ మానస షెడ్యూల్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ మంగళగిరి ఇందిరానగర్‌లోను, అక్టోబర్ 4వ తేదీ కుంచనపల్లిలోని వైఎస్సార్ క్లినిక్, అక్టోబర్ 5వ తేదీ కాజ వైఎస్సార్ ఆరోగ్యకేంద్రం, 6న డోలాస్‌నగర్‌లోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, 7వ తేదీ నిడమర్రులోని వైఎస్సార్ క్లినిక్, 10వ తేదీ ఎర్రబాలెంలోని వైఎస్సార్ క్లినిక్, 12వ తేదీ రామచంద్రాపురంలోని వైఎస్సార్ క్లినిక్, 16వ తేదీ కొప్పురావూరి కాలనీలోని వైఎస్సార్ క్లినిక్, 18వ తేదీ మంగళగిరి మార్కండేయ కాలనీలోని వైఎస్సార్ క్లినిక్, 20వ తేదీ పెదవడ్లపూడిలోని ఎంపీయూపీ స్కూల్, 24వ తేదీ కాజలోని ఎంపీపీ స్కూల్‌లో జనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

ఫోన్ చేసుకుంటానని చెప్పి ఉడాయించాడు

మంగళగిరి: నగరంలో మంగళవారం రెండు సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన ఘటనలు చోటు చేసుకున్నాయి. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుంచి శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండకు వచ్చిన భక్తుడు రంగయ్యను ఓ యువకుడు గుడికి వచ్చిన తమ వారు కనిపించడం లేదని ఒక సారి ఫోన్ ఇస్తే ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పి ఫోన్ తీసుకున్నాడు. రంగయ్య తమ కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా యువకుడు సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. కంగుతిన్న రంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హుస్సేన్ కట్ట వద్ద యువకుడు పడిపోతున్నట్లు నటించగా స్థానికంగా ఉంటున్న మద్ది శివప్రసాద్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. యువకుడు శివప్రసాద్ జేబులోని ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

నగరంలోని కొత్తపేటలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపేటకు చెందిన నవీన్ సోమవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

కేఎల్‌యూలో ఘనంగా కుమార్తెల దినోత్సవం

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయంలో కుమార్తెల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఆడపిల్ల లేనిదే సృష్టి లేదన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడంలో కూతుర్లదే పైచేయి అని అన్నారు. ఆడ, మగా తేడా లేకుండా టెక్నాలజీతో దూసుకుపోతున్న ఈ రోజుల్లో ఆడపిల్లలు లేని లోటు ఎవరూ తీర్చలేనిదని అన్నారు. ఎంతోమంది కుమార్తెలు తల్లిదండ్రులు గర్వపడేలా విజయాలు సాధించడమే కాకుండా, తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం బాలబాలికలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎస్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ప్రొఫెసర్ సుభాకర్‌రాజు, మహిళా అభివృద్ధి సెల్ కో కన్వీనర్లు డాక్టర్ కె.సోని, కో ఆర్డినేటర్ కోనేరు శిరీష, వి.సాహితి, మొహమ్మద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

ఆపదలో అపన్న హస్తం సీఎం సహాయ నిధి





బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్ కుమార్

బాధిత కుటుంబాలకు రూ. 2.75 లక్షల చెక్కుల పంపిణీ

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): పేద కుటుంబాలకు ఆపదలో ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి అని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని తన నివాసంలో బాధిత కుటుంబాలకు రూ.2.75 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ప్రకాశం జిల్లా ఇడుపులపాడుకి చెందిన అంబటి రవీందర్‌బాబుకు రూ.2.30 లక్షలు, గోవాడకి చెందిన బందెల నిత్యాకి రూ.45 వేల చెక్కును ఎంపీ నందిగం సురేష్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో నగదు చెల్లించి చికిత్సలు చేయించుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా తగిన సాయం అందిస్తుందని తెలిపారు.

చిట్యాల ఐలమ్మకు నివాళి

నెహ్రూ నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ జయంతి బాలాజీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రవర్ణాల్ని ఎదిరించి భూ పోరాటంలో విజయం సాధించిన వీర మహిళ చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ పోరాటంతోనే తెలంగాణలో ఉన్న రైతులందరూ సమానత్వం కోసం భూమి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రైతులను ఏకం చేసి లక్షలాది ఎకరాలను భూమిని రైతులకు పంచి పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహా మండలి చైర్మన్ సాదం సత్యనారాయణ, రజక ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొణిదల మురళీకృష్ణ గుంటూరు జిల్లా రజక జనసేవా సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, బీసీ సంఘం నాయకులు నిడుముక్కల రాంబాబు, బీసీ మహిళలు కె.సామ్రాజ్యం, డి.సీతారావమ్మ, గుంటూరు టౌన్ రజక జనసేవ సంఘం నాయకులు చాగంటిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘ నాయకులు

విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ కలగాలి



నిడుముక్కలలో వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ తదితరులు

- ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త సురేష్‌కుమార్
- ప్రత్యేక పూజలు

తాడికొండ: విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ కలగాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం ముక్కామల, తాడికొండ స్వరాజ్యనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సంతర్పణ కార్యక్రమాలలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోశాలలో ప్రత్యేక పూజలు

తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని అష్టలక్ష్మీ గోశాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతలకు దాణా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, మాజీ ఉప సర్పంచ్ మాదాసు ఏసురత్నం, వెంకటస్వామి, షేక్ బాజీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహనీయులను నేటి తరానికి పరిచయం చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: మహనీయులను నేటితరం యువత గుర్తించుకునే విధంగా, వారి సేవలకు గుర్తింపుగా నగర పాలక సంస్థ వ్యాప్తంగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని, దానిలో భాగంగా ప్రకాశం బ్యారేజ్ ముఖద్వారమైన బకింగ్‌హామ్ కెనాల్ వద్ద మూడు రోడ్లు కలిసే ప్రాంతంలో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. మంగళవారం కార్పొరేషన్ అధికారులతో కలసి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహనిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నో సేవలు అందించిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహ ఏర్పాట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రకాశం బ్యారేజ్ నిర్మాణం ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించారని, ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేసి ఇప్పటి తరం యువతీ యువకులకు తెలియజేసేందుకే ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

చెడు అలవాట్లకు బానిసలుగా మారితే అంధకారం

- గంజాయి ఇతర మత్తుపదార్థాలతో పట్టుపడితే చట్టరీత్యా చర్యలు
- ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు

తాడికొండ: విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిసలుగా మారితే జీవితం అంధకారం అవుతుందని ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు అన్నారు. మంగళవారం తాడికొండలోని కళాశాల బాలుర వసతి గృహంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమైనది అని ఈ దశలో చదువును వదిలి గంజాయి, మద్యం ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడి చాలామంది యువకులు భావి జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. చెడు అలవాట్ల నుంచి విద్యార్థులను దూరం చేసేందుకు కళాశాలలో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలతో పట్టుపడితే చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయని సూచించారు. పాఠశాలలో కళాశాలల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని చదివిస్తున్నారని వారి కష్టానికి తగిన ప్రతిఫలం ఇచ్చేలా విద్యార్థులు కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి స్థిరపడవచ్చు అన్నారు. విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది రమేష్, నాగరాజు, వసతిగృహం వార్డెన్ నరేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



మంగళగిరి: నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు 60 పుస్తకాలను రచయితలు అందజేశారు. మంగళవారం గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మానవత కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి రచించిన 13వ పుస్తకం టైంపాస్ 50 కాపీలతోపాటు మేరా భారత్ మహాన్ పది కాపీలను అందజేశారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అమరనాథరెడ్డి రచనా శైలి అత్యంత సామాన్యంగా ఉంటుందని, ముఖ్యంగా టైంపాస్ టులో అందవిశ్వాసాలు, రుగ్మతలను నవ్వుతూ ఆలోచించే విధానం సామాజిక స్పృహ కలిగించే అంశాలన్నిటిని చాలా చిన్న పదాలతో సమాజంలో జరిగే సంక్లిష్టమైన సమస్యలకు సులువైన పరిష్కార మార్గాలకు అన్వేషించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవత కో కన్వీనర్ సలీం మాలిక్, డాక్టర్ బి జాన్‌ప్రసాద్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ వ్యవస్థాపక సభ్యులు కంది పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని, ఆసక్తి గల భక్తులు ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్‌యూ రోడ్డు విస్తరణ పనులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెరికలపూడి, చినపాలెం, వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని కోరారు.

మేడికొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి నాగరాజుకుమార్ తెలిపారు. 33 కేవీ లైన్‌ల నిర్మాణంలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.

విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి

గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం జాతీయ వైద్యారోగ్య మిషన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యారోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మనోహర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనే మహమ్మారిపై అవగాహనతోపాటు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. హెచ్ఐవీ బారిన పడిన వారిని దూరంగా ఉంచి, బాధ కలిగించే విధంగా ప్రవర్తించకుండా వారిలో మనోధైర్యాన్ని నింపేలా కృషి చేయాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ ప్రతి యేటా విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, సిమ్స్ కళాశాల విద్యార్థి బృందాలకు వరుసగా రూ.ఐదు వేలు, రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



